# కోరిక

వై. రుక్మిణీ దేవి



కాపురాని కొచ్చిన పదకొండేళ్ళకు కడుపు పండింది. కామాక్షమ్మకి. ఆవేళ శ్రీమంతం మహావైభవంగా జరిగింది. ఆ రాత్రి చేతిలో అక్షింతలు పుచ్చుకుని నవ వధువులా సిగ్గులొలకబోస్తూ పందిరి మంచంమీద కూర్చుని వున్న భర్త దగ్గరకు వచ్చి ముసిముసి నవ్వులతో అతని చేతిలో అక్షితలుంచి వేయమని సైగ చేస్తూ అతని కాళ్ళకు దణ్ణం పెట్టింది. సంతోషంతో పొంగిపోతూ భార్య తలమీద అక్షింతలువేసి రెండు చేతులతో గుచ్చి ఎత్తి అక్కున జేర్చుకున్నాడు భర్త కనకాచలం. ఆ క్షణంలో దంపతులిద్దరూ తమకు పుట్టబోయే బిడ్డను తలచుకుని తలమునకలుగా మురిసిపోతూ ఎన్నెన్నో కమ్మని కబుర్లు చెప్పుకున్నారు.

"ఇలాంటి సందర్భాలలో ఆడవాళ్ళకు గాఢమైన కోరిక లుంటాయట. అవి తీరితే వాళ్ళకి సలక్షణమైన బిడ్డలు పుడతారట. నీ మనసులో వున్న కోరికలన్నీ నా చెవిన వేసేయి కామూ. చకచకా తీర్చేస్తాను." అన్నాడు కనకాచలం భార్య చెవిలో గుసగుసగా.

మొహం అటువేపు తిప్పుకుని ముసిముసిగా నవ్వింది. కామాక్షమ్మ.

"సిగ్గుపడకు. నా దగ్గర నీకు సిగ్గేమిటి? నీ కోరికలన్నీ నేనుగాక మరెవరు తీరుస్తారు?" ఆమె మొహాన్ని సున్నితంగా తనవేపు తిప్పుకుంటూ అడిగాడు.

వంచిన తల ఎత్తకుండానే సన్నగా నవ్వింది కామాక్షమ్మ.

"మొహమాటమెందుకు? నేనేం నీకు పరాయి వాడినా? చెప్పాలి మరి" ఆమెను మొహమాటపెడుతూ అన్నాడు కనకాచలం.

దించిన తల ఎత్తలేదు కామాక్షమ్మ. మొహాన్ని రెండు చేతులతో కప్పుకొని కిసుక్కున నవ్వింది. "సంకోచం వదిలేయ్ మరి. నువ్వు చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది?" సుతారంగా కామాక్షమ్మ గడ్డం పట్టుకొని మొహం ఎత్తి గారాబంగా అడిగాడు.

కళ్ళు అర మోడ్పుగా తెరిచి మళ్ళీ చప్పున మూసేసుకుంది కామాక్షమ్మ.

"చెప్పవా?....చెప్పు కామూ. ఏం నీ కోరిక నేను తీర్చలేనని భయంగా వుందా?" ఆమె కనురెప్పలపై పెదవులు కదిలిస్తూ అన్నాడు.

రెప్పలు పూర్తిగా తెరిచింది కామాక్షమ్మ. గాలికి నుదుటపై పారాడుతూన్న ముంగురులను నెమ్మదిగా సర్దుకుంది. తలలో పువ్వులను సరిచేసుకుంది.

"వూఁ. కానీయ్....మా బంగారం కాము విగా" భార్య చెక్కిలిపై వేళ్ళతో ముద్దుగా తడిమాడు ఆ వేళ్ళను తన చేతిలోకి తీసుకుని ముసిముసిగా నవ్వుతూ భర్త కళ్ళలోకి చూసింది కామాక్షమ్మ.

"వూఁ రెడీ:....ఒన్....టూ....త్రీ.... చెప్పెయ్"

"ఈ లోకంలో మనిద్దరమే. నాకు మీరూ మీకు నేనూ అన్నట్లుగా వుండాలని వుందండీ." గోముగా మంద్రస్థాయిలో సన్నగా వీణ మీటినట్లు అన్నది కామాక్షమ్మ.

కనకాచలం తెల్లబోయి వెర్రిమొహం వేసేశాడు. "ఇదేవిటి? నా ప్రేమను శంకిస్తున్నావా నువ్వు?" గుటకలు మింగుతూ అడిగాడు.

"శంకించటం కాదు. మన పెళ్ళైననాటి నుంచీ నా మనసులో పేరుకుని వున్న కోరిక ఈ రోజు మీ చెవిన వేశాను." తన చేతిలో వున్న అతని వేళ్ళను వదిలేస్తూ అన్నది కామాక్షమ్మ.

"అయితే....అయితే నేనేం చేయాలి?" బుర్ర గోక్కుంటూ అయోమయంగా అన్నాడు కనకాచలం.

"ఆ మాత్రం తెలీదా?" మూతి మూడు వంకరలు తిప్పింది కామాక్షమ్మ

"తెలిస్తే నిన్నెందుకడుగుతాను?"

"అ సమానం జబ్బుతో తీసుకుంటూ మన పరదాలన్నిటికీ అడ్డువస్తున్న వాళ్ళని మన మధ్య నుంచి తొలగించెయ్యటమే." కామాక్షమ్మ కంఠం ఒక్క రవ్వ కటువుగా ధ్వనించింది.

"అంటే?" అసహనంగా అడిగాడు కనకాచలం.

"మీ అమ్మగార్ని తీసికెళ్ళి హాస్పిటల్లో జాయిన్ చెయ్యండి." అతని కళ్ళ నుంచి తన దృష్టిని తిప్పుకుని అన్నది కామాక్షమ్మ.

కనకాచలం నుంచి సమాధానమేమీ రాలేదు. తల పట్టుకుని వేడి నిట్టూర్పు విడుస్తూ కూర్చుండిపోయాడతను.